క్లుప్తంగా...

ఆలయాల వద్ద సౌకర్యాలు కల్పించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చాంద్రాయణగుట్ట: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని చాంద్రాయణగుట్టలోని ఆలయాల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని స్థానిక నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు మాట్లాడుతూ..చాంద్రాయణగుట్టలోని మహంకాళి ఆలయం, బంగారు మైసమ్మ ఆలయం, పోచమ్మ ఆలయాల వద్ద అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. నాగరాజు, అశోక్ కుమార్ ముదిరాజ్, రాజు ముదిరాజ్, మహేష్ గౌడ్, షల్లేష్ తదితరులున్నారు.

జోరుగా ఘటాల ఊరేగింపు



అబిడ్స్: ఘటాల ఊరేగింపు జోరుగా నిర్వహించారు. న్యూ ఉస్మాన్‌గంజ్ మహంకాళి అమ్మవారి ఆలయం నుంచి ఘటాల ఊరేగింపు ప్రారంభించారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్‌యాదవ్ ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్ని పండగలకు ఆదరణ లభించిందన్నారు. బోనాల ఉత్సవాలను ప్రభుత్వమే స్వయంగా చేపట్టడం గర్వకారణమన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

గౌలిపురా: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం గౌలిపురా సీబీటీ క్వార్టర్స్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో కుంభాభిషేకం, గణపతి హోమం, నవగ్రహ పూజ, కలశ స్థాపన పూజలతో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కొడి మహేందర్, హరిత దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం బోనాల ఉత్సవాల ఆహ్వాన బ్రోచర్‌ను ఆలయ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్, కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి బోనాల ఉత్సవాలను ఘనంగా ప్రారంభించామని.. ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సురేందర్, కుమార్, దేవేందర్, ప్రభాకర్, ఇమానియల్, దయానంద్ పాల్గొన్నారు.

పాతబస్తీలో బోనాలు ప్రారంభం

- కలశ స్థాపనతో ప్రారంభమైన ఉత్సవాలు
- రేపటి నుంచి పాతబస్తీలో సామూహిక ఘట స్థాపన ఊరేగింపు
- 16న అమ్మవారికి బోనాల సమర్పణ
- 17న పాతబస్తీలో సామూహిక ఘటాల ఊరేగింపు



సర్వతోభద్ర మండలం స్థాపన పూజ



మహంకాళి, మహా లక్ష్మీ, మహా సరస్వతి అమ్మవార్లు



చార్మినార్: ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలు పాతబస్తీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం పాతబస్తీలోని చారిత్రాత్మకమైన పురాతన ఆలయాల అమ్మవార్లకు కలశ స్థాపన, అభిషేకం, అలంకరణ, నైవేద్యం, తీర్థ ప్రసాదాలతో బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా ఈనెల 9న అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించేందుకు ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది. శాలిబండలోని కాశీ విశ్వనాథ ఆలయం నుంచి సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఘటస్థాపన ఊరేగింపు లాల్‌దర్వాజా మోడ్ మీదుగా ఆయా ఆలయాలకు చేరుకుంటుంది. ఘట స్థాపన అనంతరం ప్రతిరోజూ పూజలు నిర్వహించే భక్తులు 16న అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించనున్నారు. 17న పాతబస్తీ ప్రధాన వీధుల్లో అమ్మవారి సామూహిక ఘటాల ఊరేగింపు కొనసాగనుంది.

◆ ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలు శుక్రవారం పాతబస్తీలో భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పాతబస్తీలోని అన్ని దేవాలయాల్లో కలశ స్థాపనతో ప్రారంభమైన ఈ బోనాల జాతర ఉత్సవాలు ఈ నెల 17వ తేదీతో ముగియనున్నాయి.

పాతబస్తీలోని ప్రధాన ఆలయాల్లో..

లాల్‌దర్వాజా సింహవాహిణి మహంకాళి ఆలయం, మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం, ఉప్పుగూడ మహంకాళి ఆలయం, గౌలిపురా మహంకాళి మాతేశ్వరీ ఆలయం, సుల్తాన్‌షాహి జగదాంబ మహంకాళి ఆలయం, మురాద్‌మహల్ మహంకాళి ఆలయం, సుల్తాన్‌షాహి బంగారు మైసమ్మ ఆలయం, గౌలిపురా నల్లపోచమ్మ ఆలయం, రాంబక్షి బండా మహంకాళి ఆలయం, బేలా ముత్యాలమ్మ ఆలయం, హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయం, హరిబౌలి అక్కన్న మాదన్న ఆలయం, రాంసింగ్‌బడా బంగారు మైసమ్మ మహంకాళి ఆలయం, మక్దూంపురా ఎల్లమ్మ ఆలయం, సుల్తాన్‌షాహి రేణుకాఎల్లమ్మ ఆలయం, గౌలిపురా బంగారు మైసమ్మ ఆలయం, మీర్‌చౌక్ బంగారు మైసమ్మ ఆలయాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి మహంకాళి అమ్మవార్లకు నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఈసారి బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

9న అమ్మవారి ఘట స్థాపన సామూహిక ఊరేగింపు..

ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించేందుకు ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది. శాలిబండలోని కాశీ విశ్వనాథ ఆలయం నుంచి సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఘటస్థాపన ఊరేగింపు లాల్‌దర్వాజా మోడ్ మీదుగా ఆయా ఆలయాలకు చేరుకుంటుంది.

ఖురాన్ కంఠస్థం చేసిన చిన్నారికి హోం మంత్రి అభినందన



సాక్షి, సిటీబ్యూరో: ఏడాది వ్యవధిలోనే ఐదున్నర ఏళ్ల చిన్నారి ఖురాన్ కంఠస్థం చేయడం ఎంతో గొప్ప విషయమని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. జమియాత్ ఉల్ మోమినాత్ మొఘల్‌పురా నుంచి చదివిన యువ విద్యార్థి హఫీజా సయ్యదా సహేష్ మోబిన్‌ను హోం మంత్రి సన్మానించారు. శుక్రవారం విద్యా సంస్థల వ్యవస్థాపకుడు మౌలానా డాక్టర్ ముఫ్తీ హఫీజ్ మహమ్మద్ మస్తాన్ అలీ ఖాద్రీ వివరాలు వెల్లడించారు. హోం మంత్రి మాట్లాడుతూ విద్యార్థిని చిన్న వయస్సులో ఖురాన్ కఠస్థం చేయడం ఒక అద్భుతంగా పేర్కొన్నారు. చిన్న వయస్సులో ఖురాన్‌లోని 30 అధ్యాయాలు గుర్తుంచుకొని కంఠస్థం చేయడం గొప్ప విషయమన్నారు.

అలరించిన హిందీ నృత్య రూపకం

నాంపల్లి: బసవేశ్వర వైశిష్ట్యాన్ని ప్రతిబింబించేలా ప్రదర్శించిన 'తుమ్హారే సివ ఔర్ కోయీనహీ' అనే హిందీ శాస్త్రీయ నృత్య రూపకం ప్రేక్షకులను అలరింపజేసింది. బసవ సంక్షేమ సమితి, రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం, రాష్ట్రీయ బసవదళ్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో గురువారం రాత్రి నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ప్రదర్శించిన నృత్య రూపకం ఆద్యంతం రక్తికట్టించింది. స్నేహ కప్పన్న నృత్య దర్శకత్వంలో సి.అశ్వత్ సంగీత దర్శకత్వంలో శ్రీనివాస్ జి.కప్పన్న నిర్దేశనంతో ప్రదర్శించారు. బసవేశ్వరుడి జీవిత సత్యాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించారు. తర్లబాలు జగద్గురు శాఖ మఠం పట్టాధ్యక్షులు, పండతారాధ్య శివాచార్య స్వామిజీ, పశ్చిమాద్రి సంస్థాన్ విరక్త మఠం పూజ్యశ్రీ పంచమ సిద్ధలింగ మహాస్వామిజీ, బసవ సంక్షేమ సమితి అధ్యక్షుడు కల్వ మల్లికార్జునప్ప, బి.ఈశ్వరప్ప, శంకర్ పటేల్, బి.శివకుమార్, రామదాసుతేజ అతిథులుగా హాజరై జ్యోతి ప్రకాశంతో సభను ప్రారంభించి ప్రసంగించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేస్తేనే ప్రజల ఇబ్బందులు తొలగుతాయని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్‌లో జరుగుతున్న బాక్స్‌టైప్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెండర్లు పొంది పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు పనులు సకాలంలో పూర్తి చేయకపోతే వారి బిల్లులు పెండింగ్‌లో పెట్టాలని ఆయన అన్నారు. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతూ పనులు పూర్తి కాకపోయినా కూడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ ఈఈ రామకృష్ణ, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకి డివిజన్ కార్పొరేటర్ ప్రతినిధి హారూన్ ఫరాన్, మజ్లిస్ నాయకులు అలీమొద్దీన్ తదితరులున్నారు.

వైభవంగా ఉప్పుగూడ మహంకాళి బోనాలు



ధ్వజారోహణలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ మహంకాళి మాతేశ్వరీ ఆలయ 74వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 4 గంటలకు ఆలయ అర్చకులు వేదాంత రాజనర్సింహ చారి, పవన్ కుమార్ ఆచార్యుల బృందం స్వహస్తాల మీదుగా గోపూజ, గణపతి పూజ, అమ్మవారి మహాభిషేకం, కలశస్థాపన, ధ్వజారోహణలు కొనసాగాయి. అనంతరం అలంకరణ, భక్తజన సందోహం నడుమ మహా హారతి నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జనగామ మధుసూదన్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈసారి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ పూజల్లో కమిటీ ప్రతినిధులు కీర్తి నరేందర్ ముదిరాజ్, శ్రీనివాస్, సతీష్, బాబురావు, రవికుమార్, భవానీ శంకర్, వేణు, సుమన్ సాయి, శివకుమార్, హృత్తిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



గౌలిపురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా గౌలిపురాలోని మాతేశ్వరి ఆలయంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు గణపతి హోమం, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 11 గంటలకు కలశ స్థాపన, ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్, కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి దంపతులు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్ రావు, ఆలే జితేంద్ర, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మధుసూదన్ గిరి, సుమన్ కుమార్ ముదిరాజ్, బి.వై.శ్రీకాంత్, బొడ్డు సాయిబాబా, ప్రకాశ్ రాజ్, జానకీరామ్, మహేందర్ గిరి, ఎ.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షిక బోనాల ఉత్సవాలు ప్రారంభం



యాకుత్‌పురా: అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో వార్షిక బోనాల ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజారోహణతో ఉత్సవాలను ప్రారంభించారు. మూడవ శుక్రవారం సామూహిక కుంకుమార్చన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాందేవ్ అగర్వాల్, ఆలయ కమిటీ సభ్యులు రాజారత్నం, భరత్‌ప్రకాష్, సతీష్, ఎస్.పి. క్రాంతికుమార్, చేతన్‌కుమార్ సూరి, వినోద్, మహేష్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక బోనాలు



అబిడ్స్: మత సామరస్యానికి ప్రతీకగా బోనాల వేడుకలు నిలుస్తాయని విద్యావేత్త, రిలయన్స్ హైటెక్ స్కూల్ విద్యా సంస్థల చైర్మన్ జితేందర్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం రిలయన్స్ హైటెక్ స్కూల్ విద్యార్థులు బోనాల సంబరాలు చేశారు. స్కూల్ నుంచి విద్యార్థినులు తమ తలలపై బోనాలు పెట్టుకుని కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చారు. జితేందర్ సింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అన్ని పండుగలపై అవగాహన కలిగే విధంగా తమ విద్యా సంస్థలు ప్రత్యేక కృషి చేస్తున్నాయన్నారు.

బీఆర్ఎస్ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం



నియామక పత్రాలు అందజేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రగతి, అభివృద్ధి దేశంలోనే నెంబర్:1 స్థాయిలో ఉందన్నారు. అనిల్‌కుమార్ జైస్వాల్‌ను గోషామహల్ నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులుగా, ఎస్.దయానంద్‌ను నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శిగా జి.వినోద్‌కుమార్‌ను ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులుగా వి.హేమంత్‌కుమార్‌ను ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, జి.సోనుసింగ్‌ను నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా బూత్‌స్థాయి నుంచి బీఆర్ఎస్ పార్టీ పటిష్టంగా ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయమన్నారు. బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే, కోటి శైలేష్ కురుమ, శంకర్‌సింగ్ జమేదార్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ కక్ష సాధింపు చర్య'

సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తున్నందునే బీజేపీ పార్టీ వాళ్లు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ గోషామహల్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం గౌలిగూడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి పలు మార్లు సేవా కార్యక్రమాల నిమిత్తం వెళ్తానని ఆయన తెలిపారు. విద్యాలయం వీసీ ప్రొఫెసర్ విజ్జులతను తాను పేద విద్యార్థులకు విద్యాపరంగా సహాయం చేస్తానని తెలిపాన్నన్నారు. తమ మధ్య జరిగిన చర్చ ఎంతో సామరస్యంగా జరిగిందని ఆయన తెలిపారు. చర్చ సందర్భంలో వీడియో పుటేజ్‌లో ఉన్న తమ హావ భావాలను పరిశీలించుకోవచ్చన్నారు.

'ఎన్నికల ముందు రాజకీయాలు చేయొద్దు'

గౌలిపురా: ప్రధాన మంత్రి విభజన హామీలు అమలు చేయకుండా తెలంగాణలో అడుగుపెట్టే అర్హత మోదీకి లేదని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రమోహన్‌గౌడ్ తీవ్రంగా విమర్శించారు. ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో రాజకీయ లబ్ధి పొందడానికి ఎన్నికలకు ముందు రాజకీయాలు చేయొద్దని. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఎందుకు ఏర్పాటు చేయట్లేదని.. విభజన హామీలు అమలు చేయకుండా అబద్ధపు గూగుల్ ప్రచారం చేసే ప్రధాని నరేంద్ర మోదీ గో బ్యాక్ అన్నారు. వరంగల్‌లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్ల శ్రీనివాస్ రావును అరెస్టును ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని పిలుపునిచ్చారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం



రోహిణ్‌రెడ్డితో కురకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి అన్నారు. కార్వాన్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆయనను కలిశారు. కార్వాన్ నియోజకవర్గంలో డివిజనల్ స్థాయి కాంగ్రెస్ కమిటీని ప్రకటించడం జరిగిందని, అయితే కార్వాన్ నియోజకవర్గం నుంచి సీనియర్ నాయకులను జిల్లా కమిటీతో పాటు రాష్ట్ర కమిటీకి చెందిన వివిధ కాంగ్రెస్ అనుబంధ విభాగాల్లో చోటు కల్పించాలని కురకుల కృష్ణ ఆయనను కోరారు. రోహిణ్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్‌కు రాష్ట్రంలో మంచి కేడర్‌తో పాటు ఓటు బ్యాంకు కూడా ఉందని ఆయన అన్నారు. దీనికి తోడు బీఆర్ఎస్ అవినీతి, అసమర్థ పాలనతో ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు పలుకుతున్నారన్నారు. రఘుపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీరాములు, అబ్దుల్ హమీద్, గిరి, వినోద్ సింగ్, రామ్ కుమార్, ప్రేమ్ కిషోర్ ఉన్నారు.



బహిరంగ హెచ్చరిక ప్రకటన

నా క్లయింట్ శ్రీ పి.విజయ్ రాజు OS No.419 ఆఫ్ 2019లో దావా దాఖలు చేసిన తేదీ నాటికి మొత్తం రూ.25,85,000/- (ఇరవై ఐదు లక్షల ఎనభై ఐదు వేల రూపాయలు మాత్రమే) లను రాబట్టుకొనుటకు వై.అర్జున్ కుమార్ మరియు మరొకరిపై దావా దాఖలు చేసారు. అది హైదరాబాద్ వద్ద **గౌరవనీయ 2వ అదనపు చీఫ్ జడ్జి, సిటీ సివిల్ కోర్ట్** వారి సమక్షంలో అపరిష్కృతంగా ఉంది. పైన తెలిపిన సదరు సివిల్ దావా అపరిష్కృతంగా ఉండగా, తరచూ నేరానికి పాల్పడుతున్న సదరు **వై.అర్జున్ కుమార్** యొక్క స్థిరాస్తిని జప్తు చేసుకొనేందుకు నా క్లయింట్ ఒక దరఖాస్తును కూడా దాఖలు చేసారు, అందులో గౌరవనీయ న్యాయస్థానం వారు వై.అర్జున్ కుమార్‌కి వ్యతిరేకంగా OS No.419 ఆఫ్ 2019లో I.A No.799 ఆఫ్ 2019 ప్రకారం షరతులతో కూడిన జప్తు ఉత్తర్వును మంజూరు చేసింది, కానీ సదరు వై.అర్జున్ కుమార్ సదరు ఉత్తర్వులను పాటించుటలో పూర్తిగా విఫలమైనందున మరియు గౌరవనీయ న్యాయస్థానం వారు స్థిరాస్తిని అనగా సదరు వై.అర్జున్ కుమార్‌కి చెందిన ఛత్రినాక, ఉప్పుగూడ, స్టేషన్ రోడ్ కందికల్ గ్రామం, హైదరాబాద్ వద్ద గల 285 చ.గ.లు లేదా 238.28 చ.మీ.ల విస్తీర్ణం కలిగి ఉండి గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు మరియు రెండవ అంతస్తు కలిగిన GHMC No. 18-7-595/5/B, 18-7-595/5/B/1, 2 & 3, గల అస్తి యావత్తు, సరిహద్దులు : **ఉత్తరం :** మెయిన్ రోడ్, **దక్షిణం:** పొరుగువారి ఇల్లు, **తూర్పు:** ఇంటి నం. 18-7-595/8 & 18-7-595/8/1,2 &3, **పశ్చిమం :** ఇంటి నం. 18-7-595/1 హద్దులుగా గల అస్తిని జప్తు చేసుకోవలసిందిగా కోర్ట్ బేలిఫ్‌ను ఆదేశించారు మరియు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు దానిని సురక్షితమైన మరియు భద్రంగా సంరక్షించవలసిందిగా కోర్ట్ బేలిఫ్ తదుపరి ఆదేశించబడినారు మరియు సదరు కోర్ట్ యొక్క బేలిఫ్ 03.06.2019న సదరు అస్తిని జప్తు చేయడం ద్వారా చట్టబద్ధమైన ప్రక్రియలో సదరు వై.అర్జున్ కుమార్‌కు నోటీస్ అందజేయడం ద్వారా సదరు అస్తిపై జప్తు వారంటును అమలు చేశారు మరియు ఆ తర్వాత సదరు కోర్ట్ యొక్క బేలిఫ్ SRO అజంపురా మరియు సంబంధిత అధికారులకు జప్తు ఉత్తర్వులకి సంబంధించి సమాచారం కూడా ఇచ్చారు మరియు సదరు గౌరవనీయ న్యాయస్థానం సమక్షంలో అతను నివేదికను దాఖలు చేసారు మరియు అది ఖరారు అయినది.

అది అపరిష్కృతంగా ఉండగా, సదరు వై.అర్జున్ కుమార్ R/o గౌలిపురా, హైదరాబాద్ వారు నా క్లయింట్‌కు సదరు మొత్తం తిరిగి చెల్లించకుండా తప్పించుకొంటున్నారని, అతను కొంతమంది మూడవ పార్టీలతో కుమ్మక్కై, సాధారణ ప్రజలను మోసగించి మరియు వంచించే ఉద్దేశ్యంతో మరియు అనేక వివాదాలు కల్పించే సదరు అస్తి జప్తు విషయం దాచిపెడుతూ సంబంధిత రిజిస్ట్రేషన్ అధికారులతో కుమ్మక్కై ఏ సంస్థలకైనా అమ్మకం/బదిలీ/తనఖా ద్వారా సాధారణ ప్రజలకు ఆఫర్ చేయడం ద్వారా తప్పుడు మరియు మోసపూరిత డాక్యుమెంట్లు తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, సదరు గౌరవనీయ కోర్ట్ యొక్క జప్తు మరియు సురక్షితమైన సంరక్షణలో పైన తెలిపిన అస్తి ఉన్నందున, అవిధంగా చేసేందుకు ఏ వ్యక్తి లేదా వ్యక్తులకు హక్కు లేదా హక్కులు లేవని నా క్లయింట్ తదుపరి తెలియజేస్తున్నారు.

అందువలన పైన తెలిపిన సదరు అస్తికి సంబంధించి సదరు వై.అర్జున్ కుమార్ లేదా అతని మనుషులు లేదా ఎవరితోనైనా ఏ రకమైన లావాదేవీ లేదా వ్యవహారం చేయరాదని లేదా కుదుర్చుకోరాదని ఇందుమూలంగా నేను నా క్లయింట్ తరఫున సాధారణ ప్రజలకు తెలియజేస్తున్నాను మరియు హెచ్చరిస్తున్నాను. పైన తెలిపిన వాస్తవాలు మరియు పరిస్థితుల దృష్ట్యా, పైన తెలిపిన అస్తి పైన ఏ వ్యక్తి లేదా వ్యక్తులు ఏ రకమైన వ్యవహారాలు జరిపేందుకు హక్కు లేదా హక్కులు లేవు. పైన తెలిపిన అస్తి కొనుగోలు చేయుటకు సదరు వై.అర్జున్ కుమార్ లేదా ఎవరితోనైనా ఏ వ్యక్తి లేదా వ్యక్తులైన ఏ రకంగానైనా వ్యవహరించినా లేదా కాంట్రాక్టు కుదుర్చుకున్నా లేదా వ్యవహారం జరిపినా అది వారి స్వంత నష్టపూచీ మరియు బాధ్యతపైననే వారు అవిధంగా చేసిన వారవుతారు మరియు తద్వారా ఎదురయ్యే అన్ని వ్యయాలు మరియు పరిణామాలకు వారు మాత్రమే బాధ్యత వహించవలసి ఉంటుంది.

సం/- M/s S. భాస్కర్ రెడ్డి, అడ్వకేట్
D.No.3-5-1089/1H, మెట్రో పిల్లర్ నం. 18 ఎదురుగా
నారాయణగూడ, హైదరాబాద్-29,
సెల్ నం. 98480 60997

తేది : 07.07.2023
ప్రదేశం : హైదరాబాద్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వెంకటేశ్ గౌడ్

శాలిబండ: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ మీరాలం ఆపరేషన్ ఏడీఈ వెంకటేశ్‌గౌడ్ సూచించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలు, విద్యుత్ పోల్స్‌కు దూరంగా ఉండాలన్నారు. అలాగే కేబుల్ ఆపరేటర్ సిబ్బంది విద్యుత్ పోల్‌పై సిటీ కేబుల్, ఇంటర్నేటట్ కేబుల్‌కు సంబంధించిన విధులు నిర్వహించేటప్పుడు నిర్లక్ష్యంతో పని చేస్తే విద్యుత్ సరఫరా జరిగే ప్రమాదం ఉందన్నారు. ఇల్లు కట్టుకోవడానికి ఎవైనా విద్యుత్ లైన్‌లు దగ్గరగా ఉంటే వారికి డిపార్ట్‌మెంట్ నియమాలను అనుసరించి మార్పుటకు అవకాశముందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో లోకల్ విద్యుత్ ఆఫీసర్‌ను సంప్రదించి సహాయం పొందాలన్నారు. కాలనీల్లో ఉండే ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూస్‌లు పోతే మా సిబ్బంది మూడు షిఫ్టుల్లో 24 గంటల పాటు అందుబాటులో ఉంటారన్నారు. ఎవరూ కూడా ఫ్యూస్‌లు వేయడానికి ప్రయత్నాలు చేయొద్దన్నారు. ఎవైనా సమస్యలుంటే ఎఫ్ఓసీ చందులాల్ బారాదరి (9490619802), ఎఫ్ఓసీ మీరాలం (9490619806), ఎఫ్ఓసీ అత్తాపూర్ (9490619804), ఎఫ్ఓసీ హైదర్‌గూడ (9490619805)లో సంప్రదించాలన్నారు.

మోదీని చంపుతామని వీడియోలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: సోషల్ మీడియాలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, సీఎం జగన్ మోహన్‌రెడ్డిను చంపుతామని వీడియోలు వైరల్ చేస్తున్న ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే సంస్థపై చర్యలు తీసుకోవాలని బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు కార్యదర్శి సూర్య శుక్లాలు కోరారు. ఈ మేరకు శుక్రవారం సైబర్ క్రైమ్ ఏసీపీ కేవీఎం ప్రసాద్‌కు జనసేన ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో దేశ ప్రధానిని, అమిత్‌షాను, జగన్మోహన్ రెడ్డిని, చంద్రబాబు నాయుడు చంపుతామని ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంస్థకు చెందిన వారు హెచ్చరికలు జారీ చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కోఆర్డినేటర్ చేతన్, ప్రవీణ్, రాకేష్, రాజారాం, శ్రీనివాస్, శ్రీను, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాతేశ్వరి ఘటం ఊరేగింపు



చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ మాతేశ్వరి ఘటం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరిగాయి. అలీజా కోట్లలోని కోట మైసమ్మ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య మాతేశ్వరి ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మీరాలం మండి ఆలయం వరకు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. పోతరాజులు ఊరేగింపు పొడవునా నృత్యాలు చేస్తూ కనువిందు చేశారు. బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు నిర్వహించే సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులుపెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

కానిస్టేబుల్‌పై పాత నేరస్తుడి దాడి

జియాగూడ: ద్విచక్ర వాహనాలను నిలిపి తనిఖీలు చేస్తుండగా ఓ కానిస్టేబుల్‌పై స్టేషనరి బ్లేడ్‌తో దాడిచేసిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, ఎస్.మన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని 100 ఫీట్ల జాతీయ రహదారి కట్టమైసమ్మ ఆలయం ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. అబిడ్స్ నుంచి పురానాపూల్ మీదుగా నలుగురు యువకులు నెంబర్‌ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలపై వస్తుండడంతో అనుమానం వచ్చిన పోలీసులు వారి వాహనాలను నిలిపి విచారిస్తుండగా ముగ్గురు యువకులు పరారయ్యారు. నేపాల్‌కు చెందిన అకేందర్(20) వెంటనే కానిస్టేబుల్ ఉదయ్‌పై స్టేషనరి బ్లేడ్‌తో దాడి చేయగా చెయ్యి అడ్డం పెట్టడంతో అరచేతికి తీవ్ర గాయమైంది. వెంటనే మిగతా పోలీసులు హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, పెట్రోలింగ్ వ్యాన్ డ్రైవర్ శ్రీకాంత్ అకేందర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో రెండు ద్విచక్రవాహనాలును దొంగతనం చేసినట్లు తెలిపాడన్నారు. అకేందర్ పాత నేరస్తుడని, పదేళ్ల నుంచి అబిడ్స్‌లో ఉంటూ స్వీపర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నిషేధిత విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



అబిడ్స్: నిషేధిత విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న ఇద్దరిని నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద రూ.32.5 లక్షల విలువ చేసే విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన నవరతన్ శ్రీరామ్(26), కాటేదాన్ నివాసి వెంకటరమణ(49) బషీర్‌బాగ్‌లో వీఆర్ఎల్ లాజిస్టిక్ లిమిటెడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో మేనేజర్‌లుగా పనిచేస్తున్నారు. పాతబస్తీకి చెందిన మజరుద్దీన్ జావేద్‌తో కలిసి నిషేధిత విదేశీ సిగరెట్లను పాట్నా నుంచి ట్రాన్స్‌పోర్ట్ వాహనాల్లో బషీర్‌బాగ్‌లోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయానికి తెస్తున్నారు. బషీర్‌బాగ్ కేంద్రంగా నగరంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 159 కాటన్‌ల నిషేధిత విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నవరతన్ శ్రీరామ్, వెంకట రమణను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు మజరుద్దీన్ జావేద్ పరారీలో ఉన్నాడు. అరెస్టు చేసిన నిందితులను అబిడ్స్ పోలీసులకు అప్పజెప్పారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఖలీల్ బాషా, ఎస్ఐలు. షేక్‌కవియుద్దీన్, నవీన్‌లతో పాటు అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.